# పెడబాటు

లేకలేక ఆడపిల్ల పుట్టిందని ఆ దంపతులు ఎంతో మురిసిపోయారు. అనుక్షణమూ ఆ పిల్లను ఆదరిస్తుంటారు. ఎంతో శ్రద్ధతో, ప్రేమతో ఆ పిల్ల ముద్దుపలుకులు విని మైమరచి పోతారు.

ఆపిల్లపై అనురాగం కొద్దీ 'సుకుమారి' అని నామకరణం చేశారు. నిజంగా ఆమె జీవితం సుఖంగానే సాగుతుందో లేక కష్టంతోనే గడుస్తుందో విధిలిఖితం యెవరు పోల్చగలరు?...

ఆమె యిప్పుడు యువతి అయింది. అందాల వొంతరి. ఎర్రబడ్డ చెక్కిళ్ళతో ముసిముసిగా నవ్వుతూంటే సూదంటు రాయిలా చూపర్లకు ఆకర్షించేస్తుంది.... ఆమె సర్వావయవాలకు గంభీర కోమలత్వాలు పుట్టుకొచ్చాయి........

మిట్టమధ్యాహ్నం...పల్లెప్రజలు పండుకునే వేళ. అంతా నిశ్శబ్దం. ఆ నిర్జన ప్రదేశంలో యే చెట్టుక్రిందనో కూర్చొని, నదిలోని నీళ్ళని చూస్తో, పిట్టల చిన్ని అరుపులను ఆలకిస్తోవుంటుంది.

నడినెత్తిమీద సూర్యుడు నాట్యమాడుతూవుంటే ఏటిదరిన కూర్చొని గాలం వేయుట ప్రతాప్ కెంతో ప్రీతి. ఆనాడామె ఒంటరిగా మఱ్రిచెట్టు నీడలో మౌనంగా కూర్చొని వుంది. ప్రతాప్ ఆమెకు కొద్ది దూరంలో కూర్చొని గాలం వేస్తున్నాడు. ఓరగా వోసా రతనివైపు చూచింది. అదే సమయంలో 'అతడు' కూడ ఆమెకేసి చూచాడు.

మర్నాడు 'సుకుమారి' ఇసుకలో కూర్చొని గూళ్లులేని పిచ్చికలకు గూళ్లు కడుతోంది. ప్రతాప్ ప్రక్కంటూ పోతూ "పెళ్ళికూతురవయ్యావ్, అంతవేగిరంగా మమ్మల్ని మరచిపోకేం" జాలిగా పలికాడు. ఆమెకా పలుకులు శూలాలతో పొడిచినట్లనిపించాయి. "మీకేం చేశాన"న్నట్టు భరించరాని ఆవేదనతో వోసా రతనివైపు దీక్షగా చూచింది. హృదయం బరువెక్కింది. గబగబా యింటికి చేరుకుంది.

కాబోయే వరుడు తనిఖీకై వచ్చాడు. తల్లి అతిజాగ్రతతో కూతుర్ని అలంకరించింది. నిగనిగ మెరిసే ఆ నల్లటి కురులను 'లేసు'తో గట్టిగా బంధించింది. నగలతో శరీరమంతా కప్పివేసింది. ఆమె సహజ సౌందర్యాన్ని మట్టిలో కలిపివేసింది. ఆతురతతో వేచియున్నారు ఆ దంపతులు "అబ్బాయి" సమాధానానికి. కిందా మీద పదేపదే పరికించిన పిమ్మట "బాగుంద"ని సమ్మతించాడు.

పెళ్ళి...బొమ్మల పెళ్ళి...జరిగిపోయింది. ఆమె ఆటవస్తువుగా మారిపోయింది. మృదువైన కంఠంలో మూడుముళ్ళూ పడిపోయాయి. ఆమె స్వేచ్ఛనీ, అందాన్ని, మృదుత్వాన్ని, నలిపిపారేశాడు.

పాపం ఆ సుకుమారి పుట్టెడాశతో పెళ్ళి చేసుకొని పవిత్రురాలౌదామనుకొంది. తన జీవిత కుసుమాన్ని ఆ పతిపాదాలకింద అర్పించాలనుకొంది. అతడు తన జీవిత పథానికి తోడునీడై వుంటాడని ఆశించింది కాని అంతా నిరాశ......

నోచిన నోముల్లో ఏమి కొరతవున్నదో ...కాపురానికి వచ్చినపిమ్మట అతడు కన్నెత్తిచూసే పాపాన పోలేదు. మరీ కొత్తలో మనసులో కోరికలను...బిడియపడి...మనసులోనే మాటుపరచుకుని... వువ్విళ్ళూరుతూ ఊరుకునేది, అతనికే నాటికైనా మనసు తిరుగక పోతుందా అని. రోజులు గడిచి...నెలలు మళ్ళిపోయినవి. కాని అతనిలో మార్పేమీ కలుగలేదు. సరి, ఆనాటికానాడు దూరమైపోతూ వచ్చాడు. ఆమె నేరమేమిటో? తెలివితేటలు లేవా, అందగత్తె కాదా—చనువు యిస్తే అతనికి మనసు వచ్చినట్టు నడచుకోలేనిదా...ఆమెవల్ల లోపమేమిటి?

ఎన్నాళ్ళో వోపికపట్టి చూసింది. లాభం లేదని తోచిన తరువాత...చొరవచేసుకుని స్వయందూతిగా తన్ను అర్పించుకునేందుకు సిద్ధమైనది. కులపాలికా సహజమైన లజ్జను విడిచి కాళ్ళంటి బతిమాలుకున్నది.

ఇంకొకర్ని యెవరినన్నా ప్రేమించుతూన్నాడా? ఆ సంశయం అనుక్షణమూ తోస్తూండేది. కాని, అతని ప్రవర్తనలో...యే దోషమునకు తావు కనపడలేదు...... మరి...?

ఇక ఆమె పతి సమీపానికి చేరుకోలేక పోయింది. ఆమె కోర్కెలు సగం చచ్చే పడివున్నాయి. ఆమెలో వుత్సాహము, ఆమెజీవితంలో సుఖమూ లుప్తించి పోయినాయి.

ఆమెకు తనదన్న జీవితమే లేదు. ఆమెకు యింకెవరూ లేరు. ఆమె తనలోనే వుండి, తనలోనే యెండి, తనలోనే మండి మసైపోతోంది...ఆనాడు పవలంతా గుండె పగిలిపోయేటట్టు యేడ్చి, యేడ్చి సోలిపోయింది. కాని యెవ్వరూ... తన దుస్థితికి సానుభూతి... తెలుపలేదు. ఈ దుఃఖభారాన్ని సహించలేక అప్పుడప్పుడూ ఆమెకు జీవితంమీదే విరక్తి కలుగుతుంది...విసువు పుడుతుంది. రెండు రోజుల్నించి అన్నం తినలేదు...ఆకలి మంటకు విస్తరిముందు కూర్చుంది....సహించలేదు...కంటినుంచి కారిననీటితో...అన్నం అడుసైపోయింది.

ఒకనాడు తొందరగా పొరుగూరు పోవలసిన పని వచ్చింది. ఆమె నిశ్చేష్టరాలై పోయింది...గుర్రాన్ని కొరడాతో ఒకటి గట్టిగాకొట్టి, కులాసాగా ఈలవేస్తూ, "అతన్ని" తీసుకపోతూంటే, ఆమె హృదయం...యేదో చెప్పలేని ఆవేదనతో బాధపడింది. ఆమె చూసినచూపు...అంతే... అదే ఆఖరుచూపు...

గది...చిన్నపోయింది. గదిలోని అలంకారములన్నీ!..చీకటి కబళించి వేసినది. ఇంటినిండా దీపాలు వెలుగుతున్నా...ఇల్లు చీకటిగానే వుంది...ఆమెకళ్ళకి!...ఇంటిని మింగే అంతా మనుష్యులున్నా...ఇల్లు శూన్యంగానే వుంది...! ఆమెతోపాటు, ఆ గది, కుర్చీ, స్టాండూ, అద్దం, దువ్వెనా, కప్పులు, అన్నీ బావురుమని ఎవరికీ వినబడకుండా ఏడుస్తున్నాయి...

ఎక్కడికి వెళ్ళిందీ యెవరికీ తెలియదు. ఎందుకు వెళ్ళిందీ తలచుకుంటే ఒక వింత కథలా గుంటుంది. ప్రశ్న వేస్తే—జవాబుండదు...ఆరాత్రంతా నిద్రలేకపోయింది ...ఆమె తన జీవితంమీద దృష్టి వేసుకుని, తనెంత నిర్భాగ్యురాలో నిశ్చయించుకుంది. ఆ రాత్రంతా...ఏడ్చి...ఏడ్చి...హృదయ భారాన్ని తగ్గించుకుంది.

కొంతమంది యెర్రటోపీలవాళ్ళు వచ్చి "తనవారి" చేతులకు సంకెళ్ళమోత వేసి తీసుకపోయారని కలగన్నది. తెలివివచ్చేసరికి కళ్ళుతెరిచి చూచింది...యేముంది? శూన్యం...

వాస్తవముగా...ఒకరోజున వారు జైలుకి వెళ్లారని విన్నది...యేడ్వలేక పోయింది. తోడు యెవరున్నారు కన్నీటి కాల్వలు కట్టించుకోటానికి! ఆమె ఒంటిగా, ఒక్కతే! అపరిచయంగా, అజ్ఞానంగా తనలోనే అణిగివుంటోంది. ఒక్కొక్కప్పుడు తనలో తాననుకొంటుంది. "ఈ విశాల సామ్రాజ్యానికి 'తనో' కంటకమా? తన దేశంకోసం, స్వాతంత్ర్యం కోసం పాటుపడుతూవుంటే అట్లా బంధించడ మెందుకూ?" నిర్భాగ్యురాలు అంతకంటే ఇంకేం చేయగలదు?

ఒకనాడు వుత్తరం వచ్చింది "...... గొప్ప జ్వరబాధలో వున్నాడు. డాక్టర్ల ప్రయత్నాలు నిష్ఫలమైనాయి......" మరి చదువలేక పోయింది.

...ఇవ్వాళ ఆమెపతి చనిపోయాడని వింటోంది. వార్తా పత్రికలలో నల్లని అక్షరాల్లో చెక్కబడి వుంది. ఆమెకు దీనిమీద విశ్వాసం కలుగలేదు. అయినా ఆమె హృదయం క్రుంగిపోయింది. ఇవ్వాళ ఆమె జీవితంలో అంధకారం పూర్తిగా వ్యాపించిపోయింది. ఆమె యేడవాలని కోర్కె వుంచుకొనికూడా యేడవలేక పోయింది. అగాధ దుఃఖం ఆమెను వంచివైచింది. ముఖాన కుంకుమ తుడుచుకుంది. వైధవ్య పరిధానం ధరించుకుంది...


## కుట్టుపని స్వబోధిని

కోట్లు, ప్రొజర్లు, షర్టులు, జాకెట్లు కత్తిరించి కుట్టు కొత్తపద్ధతులు డ్రాయింగులలో గలదు. స్త్రీలు, పురుషులు, బాలికలు యీగ్రంథముచూచి సులభముగా నభ్యసించతగినది. ప్రతి దర్జీవారికిని ముఖ్యముగా చేతిలో వుండవలసిన పుస్తకము. ధర అ. 10.

మహారాజ పుస్తకశాల,
12, అరుణాచల మొదలివీధి, 18, బీటు, మద్రాసు.